# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

26.10.2025 ఆదివారం Surday
సంపుటి (volume): 1 సంచిక (Issue): 125
పేజీలు : 8 Pages : 8
వెల రూ. 2.00
Published from : Hyderabad
Circulated to : Telangana


5NEWS



## కోరుట్ల–మెట్‌పల్లిల్లో

# 'జువ్వాడి ముద్ర'



రెండు మున్సిపాలిటీలకు రూ.37.40 కోట్లు నిధులు

- జువ్వాడి నర్సింగరావు కృషి ఫలితమంటున్న నాయకులు
- ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పథకాల హామీ



మున్సిపాలిటీల అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం







**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి దిశగా మరో పెద్ద అడుగు పడింది. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలకు ఒక్కో మున్సిపాలిటీకి రూ.18 కోట్లు 70 లక్షల చొప్పున, రూ.37 కోట్లు 40 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల మంజూరుకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జువ్వాడి నర్సింగరావు కీలకపాత్ర పోషించారు. పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి స్థానిక సమస్యలను వివరించడంతో ప్రభుత్వం స్పందించింది. జనాభా, పన్ను ఆదాయం, ప్రాథమిక సదుపాయాల లోటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని యూఐడీఎఫ్ పథకం కింద ఈ నిధులు మంజూరు అయ్యాయి. "ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది. ప్రతి వార్డులోనూ మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం" అని జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధి నుండి దూరమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కనీస సౌకర్యాలు అందేలా నిధులు కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు.

### అభివృద్ధికి బాటలు

కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలకు రూ.37.40 కోట్లు మంజూరు చేయడం అభివృద్ధి దిశగా మలుపుతిప్పే నిర్ణయమని జువ్వాడి నర్సింగరావు అన్నారు. మున్సిపాలిటీల లోని రహదారులు, డ్రెయినేజీ, వీధిదీపాలు, పారిశుధ్య సదుపాయాల అభివృద్ధి కోసం ఈ నిధులు వినియోగిస్తామని తెలిపారు.ప్రతి వార్డులో ప్రజా అవసరాలను గుర్తించి తగిన ప్రణాళికతో అభివృద్ధి చేపడతామన్నారు.

### పేదలకు హామీ - ఇందిరమ్మ ఇండ్లు అందజేత

గత పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో అన్యాయం జరిగిందని జువ్వాడి విమర్శించారు. కేవలం 80 ఇళ్లు మాత్రమే ఇచ్చి అవి కూడా కార్యకర్తలకే కేటాయించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 3 వేల మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రోసీడింగ్స్ జారీ చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు అందే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నెరవేర్చింది

మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500సిలిండర్, రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని జువ్వాడి వివరించారు. ఇరిగేషన్ పనులకే 10కోట్లు, కొండ్రికర్ల బ్రిడ్జికి 6.80కోట్లు, రోడ్లు, డ్రెయినేజీ అభివృద్ధికి 12కోట్లు, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా 10 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. "ఇది మొదటిదశ మాత్రమే.. ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీ అభివృద్ధే నా ప్రాధాన్యం" అని జువ్వాడి నర్సింగరావు స్పష్టం చేశారు.

### ప్రజలే బలం - అభివృద్ధి పంథాలో కాంగ్రెస్

కోరుట్ల నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తున్నామని నర్సింగరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మొత్తం అభివృద్ధి దిశగా ముందుకెళ్తోందని చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తాము కృషి ఆపబోమని, ప్రజల ఆశలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.





# ఉత్సాహంగా

## 'పోలీస్-ప్రెస్' ఫ్రెండ్లీ మ్యాచ్





### టాస్ వేసిన జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

### మీడియా-పోలీసుల మధ్య బంధానికి క్రీడలే వంతెన : ఎస్పీ

నేటి సాక్షి, జగిత్యాల: జగిత్యాల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం పోలీస్ వర్సెస్ ప్రెస్ మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. ఎస్పీ అశోక్ కుమార్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన ప్రెస్ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 12 ఓవర్లలో 90 పరుగులు చేసింది. దానికి ప్రతిగా ఆడిన పోలీస్ జట్టు క్రమశిక్షణతో ఆడి 91 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం విజేత, రన్నర్ జట్లకు ఎస్పీ ట్రోఫీలను అందజేశారు. "బెస్ట్ బ్యాట్స్‌మన్", "బెస్ట్ బౌలర్", "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" అవార్డులను ప్రకటించి జట్టు సభ్యులను ప్రోత్సహించారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ ఎస్పీ అశోక్ కుమార్ "పోలీసులు, మీడియా సమాజానికి రెండు ముఖ్యమైన వర్గాలు. వీరిద్దరూ ప్రజల భద్రత, సంక్షేమం అనే ఒకే లక్ష్యంతో పనిచేస్తారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచి పరస్పర అవగాహనకు దోహదం చేస్తాయి," అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి సంవత్సరం జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘు చందర్, రాములు,జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిట్టి శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, సీఐలు అనిల్ కుమార్, రామ్ నరసింహారెడ్డి,సురేష్, రవి, కరుణాకర్, ఆర్ఐలు సైదులు, వేణు, ఎస్ఐలు,అలాగే పత్రికా మిత్రులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మొత్తానికి మైదానం ఉత్సాహంతో మార్మోగి, ఆటవిడుపు వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





# మిత్ర ద్రోహం!



- అప్పు తీసుకున్న వ్యక్తి గతేడాది 'రోడ్డు ప్రమాదం'లో దుర్మరణం
- అప్పు ఇచ్చిన వ్యక్తి 'బ్రెయిన్ స్ట్రోక్'తో అకాలమరణం
- మృతదేహంతో 'చనిపోయిన' మిత్రుని ఇంటిముందు నిరసన
- మిత్రుడు తీసుకున్న రూ.30 లక్షలు ఇవ్వకపోవడం వల్లే 'బ్రెయిన్ స్ట్రోక్'
- 'ఇష్యూ' కోర్టులో ఉంది.. మాకేం సంబంధమంటూ 'మిత్రుడి మామ' దబాయింపు
- శవంతో ధర్నా చేస్తున్న వారిని బెదరగొట్టిన మేడిపల్లి ఎస్ఐ









'అప్పులోడు సచ్చిపోవాలె.. కాయిదాలు కాలిపోవాలె..' అని పల్లెటూళ్లలో వెటకారంగా మాట్లాడుకునే వారు.! ఇప్పుడు ఇక్కడ జరిగిన 'మిత్రద్రోహం' ముచ్చట వెనుక కూడా..'అప్పు' తీసుకున్న వ్యక్తి గతేడాది రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెంది తే.. 'అప్పు' ఇచ్చిన వ్యక్తి తిరిగిరాని డబ్బులకోసం టెన్షన్ పడి 'బ్రెయిన్ స్ట్రోక్'తో అకాలమరణం చెందిన వైనం కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో శనివారం జరిగింది.! ప్రస్తుతం మృతిచెందిన వ్యక్తి మృతదేహాన్ని తీసుకుని బంధువులు, స్నేహితులు కలిసి మేడిపల్లిలోని మిత్రుడి ఇంటిముందు ఆందోళన చేపట్టారు.తీసుకున్న అప్పు చెల్లించే వరకు ఇంటిముందు నుంచి శవాన్ని తీసేదే లేదని గొడవకు దిగడంతో.. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.స్థానిక ఎస్ఐ వచ్చి కేసు పెట్టాల్సి వస్తుందని బెదిరించడంతో బంధుమిత్రులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లారు.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

## అసలేం జరిగింది.?

మేడిపల్లికి చెందిన పోరుమల్ల వేణురావు అల్లుడైన సుజన్ రావు అనే మిత్రుడికి.. కోరుట్ల మండలం వెంకటాపూర్ కు చెందిన తాండ్ర వెంకట ప్రసాద్ రావు (45) అనే దగ్గరి ఫ్రెండ్ వ్యాపార నిమిత్తం రూ.30 లక్షలు అప్పుగా ఇచ్చారు. 2012 నుంచి ఇచ్చిన అప్పు సొమ్మును తిరిగి ఇవ్వమని ఏళ్లుగా అడిగినా దాటవేస్తూ వచ్చారు.విసిగిపోయిన ప్రసాద్‌రావు కోర్టును ఆశ్రయించారు. అయినా కూడా అప్పు చెల్లించడానికి ముందుకు రాలేదు. కోర్టు ఎన్ని సార్లు 'అరెస్ట్ వారెంట్' ఇస్తే అన్ని సార్లు 'కాళ్లావేళ్లా పడి' వాయిదాలు తీసుకునేవాడు.పలుమార్లు పంచాయతీలూ జరిగాయి. ఒకదశలో అతని మామ పెద్దల ముందు అప్పు చెల్లిద్దాం.. ఏవైనా ఏర్పాట్లు చేద్దామని మాట ఇచ్చినట్టు ప్రసాదరావు బంధుమిత్రులు గొడవపడ్డ సమయంలో వినిపించాయి. అయితే దురదృష్టవశాత్తు గతేడాది మే నెలలో మేడిపల్లి శివారులో జరిగిన కారు ప్రమాదంలో సుజన్ రావు దుర్మరణం చెందారు.దీంతో 'షాక్'తిన్న ప్రసాద్ రావు పెద్ద మనుషుల సాయంతో మళ్లీమళ్లీ ప్రయత్నాలు చేస్తూనే వచ్చారు.



## 'బ్రెయిన్ స్ట్రోక్'తో అకాలమరణం

ప్రసాదరావు ఉదార స్వభావంతో సాటి మిత్రుడికి వ్యాపార నిమిత్తం అప్పుగా ఇచ్చిన పేమెంట్ ఇక ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి వచ్చే అవకాశం లేదని భావించిన మానసిక ఒత్తిడికి గురై 'బ్రెయిన్ స్ట్రోక్'తో శనివారం ఆయన అకాలమరణం చెందాడు.దీంతో మృతుడికి భార్య నిరోష.. ఇద్దరు కొడుకులు విహాన్..నిహాల్ లు చిన్న పిల్లలు ఉండడం చేత ..వారి భవిష్యత్తు ఏంటని నిలదీస్తూ సుజన్ రావు ఇంటిముందు శవంతో ఆందోళనకు దిగారు.బంధుమిత్రులు సుజన్ రావు మామ వేణు రావుతో వాగ్వాదానికి దిగారు.ఆయన విషయం కోర్టు పరిధిలో ఉంది.. నేనేం చేయగలను.. మర్యాదగా ఇక్కడి నుంచి వెళ్లిపోండని దబాయించడంతో రెండు గంటల పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.దీంతో వేణు రావు పోలీసులకు సమాచారం అందించారు.ఈ క్రమంలో మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ వచ్చి ఆందోళన చేపట్టిన వారిని 'కేసుపెట్టాల్సి' వస్తుందని బెదిరించడంతో బంధుమిత్రులు ప్రసాద్ రావు మృతదేహాన్ని వెంకటాపూర్ స్వగృహానికి తీసుకువెళ్లారు.ఈ ఉదంతం జిల్లాలో చర్చానీయాంశమైంది.!



# అన్న లుక్కు.. అదుర్స్!

తెల్లచొక్కా పక్కనెట్టి.. నేవీ బ్లూ షర్ట్ వేసి.. సర్ ప్రైజ్ ఇచ్చిన జువ్వాడి

దిల్ రాజు ఫ్యామిలీ ఫంక్షన్'లో మెరిసిన జువ్వాడి నర్సింగ్ రావు

- బ్లూ షర్ట్‌లో అన్న అదుర్స్ అని అభిమానుల జోష్
- ఫార్మల్ డ్రెస్సింగ్‌లో స్టైలిష్ లీడర్‌గా ఆకట్టుకున్నారు
- కేవీపీ, పొన్నం ప్రభాకర్‌లతో సన్నిహితంగా ముచ్చట్లు





నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

రాజకీయ నేత అంటే తెల్లని 'ఖద్దరు దుస్తులు'.. క్లీన్ లుక్.! ఇదే ఇప్పటి వరకు సాధారణ ప్రజల అభిప్రాయం.! కానీ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ జువ్వాడి నర్సింగరావు ఈ స్టీరియోటైప్‌ను చెరిపేశారు. సాధారణంగా తెల్ల చొక్కా, తెల్ల ప్యాంట్‌లోనే కనిపించే నర్సింగరావు ఈ సారి పూర్తిగా న్యూ లుక్‌లో దర్శనమిచ్చారు. నేవీ బ్లూ కలర్ షర్ట్, క్రీమ్ ప్యాంట్, ఇన్‌షర్ట్‌తో టక్ చేసిన కొత్త స్టైల్‌లో మెరిసిపోవడంతో అందరి దృష్టినీ ఆకర్షించారు.

## సోషల్ మీడియాలో వైరల్ ఫోటోలు

నిర్మాత దిల్‌రాజు కుటుంబానికి చెందిన ఒక వేడుకలో పాల్గొన్న నర్సింగరావు కొత్త డ్రెస్సింగ్ స్టైల్ అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. 'ఎప్పుడూ తెల్లదుస్తుల్లో ఉండే మా లీడర్ ఇప్పుడు హీరోలా కనిపిస్తున్నాడు' అంటూ అభిమానులు ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. 'టక్ చేసుకున్నా కాస్తా లుక్ మారిపోతుందా ఏ మో.. మా అన్న సూపర్!' అంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది.

## పాత మిత్రులతో ముచ్చట్లు

వేడుకలో జువ్వాడి నర్సింగరావు పక్కనే దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సన్నిహితుడు కేవీపీ రామచంద్రరావు, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి సందడి చేశారు.కేవీపీతో చాలాసేపు మాట్లాడుతూ పాత రాజకీయ జ్ఞాపకా లను గుర్తుచేసుకున్నారు. వేడుక ప్రాంగణం ఒక రాజకీయ మినీ సమ్మిట్‌లా మారిందని చెప్పొచ్చు.

## ప్రతి వేడుకలో జువ్వాడి సోదరులు

ఎవరు పిలిచినా, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి వేడుకకు తప్పక హాజరవడం జువ్వాడి సోదరుల ప్రత్యేకత.! అందుకే ప్రజల్లో 'జువ్వాడి అన్నలు మన వారే' అనే పేరు తెచ్చుకున్నారు. రాజకీయంగా ఎంత బిజీగా ఉన్నా, అభిమానులతో కాస్తా సమయం గడిపేందుకు ఎప్పుడూ రెడీగా ఉండే వారి ఆ 'హ్యూమన్ టచ్'కి అందరూ 'ఫిదా' అవుతున్నారు.



# కోరుట్లలో కొట్టుకున్న మాజీ కౌన్సిలర్‌లు

భూ వివాదమే కారణమా.?



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** వాళ్లిద్దరూ ప్రజలకేవైనా ఇబ్బందులు వస్తే దగ్గరుండి పరిష్కారం చూపిన వాళ్లు.! అవసరాల్లో.. ఆపదల్లో వెన్నంటి ఉండి తలలో నాలుకలా ఉండి 'పెద్ద దిక్కు'గా ఉండేవారు.! అదేంటో 'ఓ భూపంచాయితీ'లో తలదూర్చి సహనం కోల్పోయారు. దీంతో వారిద్దరూ ఒకర్నొకరు కొట్టుకుని పోలీస్ స్టేషన్ మెట్టెక్కడంతో అగో.. కోరుట్లలో ఇద్దరు మాజీ కౌన్సిలర్‌లు కొట్టుకుని పోలీస్ స్టేషన్ వచ్చారట గదాని కోరుట్లలో చర్చానీయాంశమైంది.! కోరుట్ల మున్సిపల్‌లో కౌన్సిలర్‌లుగా వ్యవహరించిన పేర్ల సత్యం.. వెంకటస్వామి ఇద్దరూ ఓ 'భూమి విషయం'లో తలదూర్చి వివాదానికి తెరలేపినట్టు సమాచారం? ఆ భూమి గురించి పరస్పరం వాగ్వాదానికి దిగిన అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసి కొట్టుకున్నారని తెలిసింది. ముఖంపై రక్తగాయాలయ్యేలా కొట్టుకుని.. బట్టలు కూడా చింపేసుకునే వరకు ఘర్షణ పడ్డట్టు విశ్వసనీయ సమాచారం. కాగా.. మళ్లీ వాళ్లిద్దరూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసేందుకు కోరుట్ల పోలీసు స్టేషన్ మెట్లెక్కినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అధికారిక సమాచారం తెలుసుకునేందుకు ఎస్ఐ, సిఐలను 'నేటి సాక్షి' సంప్రదించిన నేపథ్యంలో పైఅధికారులతో అత్యవసర సమావేశంలో బిజీగా ఉన్నందున పూర్తి వివరాలు అందలేదు.!